# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 19-07-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **మత్తు పదార్థాల వ్యసన విముక్తికి సంబంధించి జాతీయస్థాయి సహాయ కేంద్రం నెంబర్‌ను కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రారంభించారు.**

**2.** **ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఆగష్టు 15వ తేదీ నుంచి అన్నా క్యాంటిన్‌లను ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ వెల్లడించారు.**

**3.** **ఆంధ్రప్రదేశ్‌లోని పలు విశ్వవిద్యాలయాలకు రాష్ట్ర ప్రభుత్వం ఉపకులపతులను నియమించింది.**

**4.** **ఎన్నికల హామీ మేరకు తెలంగాణలో రైతుల రుణమాఫీ అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి తెలిపారు.**

**5.** **ఈ నెల 23 నుంచి తెలంగాణ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి.**

**6.** **అల్పపీడనం ప్రభావంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ తెలిపింది.**

==========================

వ్యసన విముక్తికి సంబంధించి జాతీయస్థాయి సహాయ కేంద్రం నంబర్ 14446ను కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రారంభించారు. అమిత్‌షా అధ్యక్షతన నార్కో సమన్వయ కేంద్రం ఏడో ఉన్నత స్థాయి సమావేశం నిన్న ఢిల్లీలో జరిగింది. అనంతరం దృశ్యమాధ్యమం ద్వారా నిర్వహించిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ వెలగపూడి సచివాలయం నుండి పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వినియోగాన్ని కట్టడి చేసేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేశామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో మాదకద్రవ్యాల నియంత్రణకు చేపడుతున్న చర్యల గురించి వివరించారు. మత్తు పదార్థాల సరఫరాదారులపై నిరంతర నిఘా కొనసాగిస్తున్నామని తెలిపారు.

---------------------------

ఆగష్టు 15వ తేదీ నుంచి అన్నా క్యాంటిన్‌లను ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా తిరిగి ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. ఒంగోలులోని అన్నా క్యాంటిన్‌లను స్థానిక శాసన సభ్యులుజనార్దన్‌తో కలిసి గత రాత్రి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, వచ్చే నెల 10వ తేదీ నాటికి చాలా ప్రాంతాల్లో అన్నా క్యాంటీన్లు పనులు పూర్తవుతాయన్నారు. అన్ని అన్నా క్యాంటీన్లు ఒకే

రూపంలో ఒకే విధంగా ఉంటాయని వీటిద్వారా 5రూపాయలకే అల్పాహారం, భోజనం అందిస్తామని మంత్రి వివరిస్తూ..

...వాయిస్ ..30 సెకన్లు

---

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణలో రైతుల రుణమాఫీ అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి తెలిపారు. రుణమాఫీలో భాగంగా తొలివిడతగా 1 లక్ష రూపాయలలోపు రైతు రుణాల మాఫీని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. తెలంగాణ వ్యాప్తంగా 110 రైతు వేదికల్లోని రైతులతో దృశ్య మాధ్యమం ద్వారా హైదరాబాద్ సచివాలయం నుంచి ఆయన మాట్లాడారు. మొత్తం 11.50 లక్షల మంది రైతుల ఖాతాల్లో 6 వేల 98 కోట్ల రూపాయల నగదు జమ చేసినట్లు తెలిపారు. ఆర్థికశాఖ ఇప్పటికే బ్యాంకులకు నగదు జమ చేసిందని తెలిపారు. ఈ నెలాఖరు నాటికి లక్షన్నర వరకు ఉన్న రైతు రుణాలను మాఫీ చేస్తామని చెప్పారు. మొత్తం మూడు విడతల్లో 31 వేల కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేస్తామని అన్నారు. పాస్‌బుక్ ఆధారంగానే రుణమాఫీ ఉంటుందని కుటుంబాన్ని నిర్ధారించేందుకే రేషన్ కార్డు ప్రామాణికంగా తీసుకున్నామని తెలిపారు. రేషన్ కార్డులు లేని వారికి. పాస్‌బుక్ ఆధారంగా రుణమాఫీ చేస్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

---

తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసే నిధులను రుణమాఫీకే వినియోగించాలని, ఇతర బకాయిలకు జమ చేయొద్దని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బ్యాంకు అధికారులకు సూచించారు. నిన్న వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి హైదరాబాద్ లోని ప్రజాభవన్‌లో బ్యాంకర్లతో నిన్న ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ, రైతు రుణమాఫీ దేశంలోనే చరిత్రాత్మక నిర్ణయమని చెప్పారు. 2లక్షల వరకు రుణాలకు నిధులు విడుదల చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసే 2 లక్షల రూపాయలు కలిపి మొత్తంగా ఏ రైతూ రుణ బకాయి ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

---

ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, సౌకర్యాలతో కూడిన క్రీడా అకాడమీ ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్థలాన్ని ఏర్పాటు చేస్తామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. నిన్న ఢిల్లీలో క్రీడా విశ్వవిద్యాలయం ఉపకులపతి కరణం మల్లీశ్వరితో కేంద్ర మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒలింపిక్స్‌లో పతకం సాధించిన మహిళా అథ్లెట్‌గా చరిత్ర సృష్టించించి కరణం మల్లీశ్వరి తెలుగు వారి ఖ్యాతిని ప్రపంచానికి తెలియజేశారన్నారు. అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించేందుకు ఆంధ్రప్రదేశ్‌లో క్రీడా నైపుణ్యాలున్నవారికి తగిన ప్రోత్సాహం అందించేందుకు క్రీడాభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని కరణం మల్లీశ్వరిని ఆహ్వానించినట్లు మంత్రి పేర్కొన్నారు.

---

పశ్చిమ మధ్య, దాన్ని అనుకుని ఉన్న వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో కోస్తా, రాయలసీమల్లో మరో రెండు రోజుల పాటు ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం సంచాలకులు స్టెల్లా తెలిపారు. గంటకు 30 నుంచి 40 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయని పేర్కొన్నారు.

అల్పపీడన ప్రభావంతో ఈ రోజు ప్రకాశం, నంద్యాల జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు, శ్రీకాకుళం నుంచి తిరుపతి జిల్లా వరకు పలు చోట్ల ఓ మోస్తరు నుంచి భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తు నిర్వహణ సంస్థ సూచించింది. మరోవైపు భారీ వర్షాల దృష్ట్యా వరద ప్రభావంపై ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గత అర్ధరాత్రి అధికారులతో సమీక్షించారు. ప్రాణనష్టం లేకుండా చర్యలు తీసుకోవాలని, పశుసంపదకు నష్టం వాటిల్లకుండా చూడాలని సూచించారు. పంటనష్టం నివారించాలని చెప్పారు.

---------------------------

తెలంగాణలో పలు జిల్లాల్లో ఈ రోజు, రేపు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎరుపు రంగు హెచ్చరికను జారీ చేసింది. ఈ రోజు ములుగు, భద్రాద్రి–కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని కుమురంభీం–ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్, హనుమకొండ జిల్లాలో అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. రేపు 11 జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని ఆయా ప్రాంతాల్లో ఏకంగా 20 సెంటీమీటర్లకు పైగా వర్షం కురిసే అవకాశముందని పేర్కొంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని పలు విశ్వవిద్యాలయాలకు ఉపకులపతులను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఆంధ్రా విశ్వవిద్యాలయానికి శశిభూషణ్‌రావు, నాగార్జున విశ్వవిద్యాలయానికి కె గంగాధర్, అనంతపురం జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయానికి సుదర్శన్‌రావు నియమితులయ్యారు. ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతిగా నరసింహంకు అదనపు బాధ్యతలు అప్పగించింది శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ ఉపకులపతిగా సిహెచ్ అప్పారావు, శ్రీకృష్ణదేవరాయల విశ్వవిద్యాలయానికి బి.అనిత నియమితులయ్యారు. కృష్ణా విశ్వవిద్యాలయానికి ఆర్. శ్రీనివాస్‌రావు, రాయలసీమ విశ్వవిద్యాలయానికి ఎన్‌టీకే నాయక్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

---------------------------

తెలంగాణ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 23న ప్రారంభం కానున్నాయి. 23 నుంచి శాసనసభ, 24 నుంచి శాసన మండలి సమావేశాలు నిర్వహించేందుకు తెలంగాణ గవర్నర్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నెల 25న పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశముందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.సుమారు 10 రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు జరిగే అవకాశముంది. బడ్జెట్‌తోపాటు, ధరణి, రైతు భరోసా, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు, ఉద్యోగాలతో పాటు తెలంగాణ తల్లి విగ్రహం, ప్రభుత్వ చిహ్నం తదితర అంశాలపై చర్చించనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.కాగా ఈ నెల 25న రాష్ట్ర మంత్రివర్గం .. సమావేశం నిర్వహించి బడ్జెట్ ప్రవేశ పెట్టేందుకు అనుమతి ఇవ్వనుంది.

---------------------------

వీర స్వాతంత్ర్య సమరయోధుడు మంగళ్ పాండే జయంతి ఈ రోజు. 1827 జులై 19వ తేదీన ఉత్తరప్రదేశ్లోని సగ్వాలో జన్మించిన ఆయన 9వ ఏటనే బ్రిటిష్ సైన్యంలో చేరారు. బ్రిటిష్ ప్రభుత్వ దుశ్చర్యలను సహించక, వారిపై యుద్ధాన్ని ప్రకటించిన తొలి స్వాతంత్ర్య సమరయోధులు మంగళ్ పాండే భారతీయుల ఆలోచనలను స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలవైపు మళ్ళించిన ఆయన దేశమాత స్వేచ్ఛకోసం ప్రాణాలు త్యాగం చేశారు.

---------------------------

నీట్–యూజీ 2024 పరీక్ష ఫలితాలను నగరాలు, పరీక్ష కేంద్రాల వారీగా శనివారం మధ్యాహ్నంలోపు విడుదల చేయాలని జాతీయ పరీక్షల సంస్థ –ఎన్టీఏను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఫలితాలను వెల్లడించే సందర్భంలో విద్యార్థుల గుర్తింపు బహిర్గతం కాకుండా జాగ్రత్త వహించాలని పేర్కొంది. నీట్–యూజీ 2024 ప్రశ్నాపత్రాల లీక్, పరీక్షల్లో అవకతవకలు జరిగాయంటూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు నిన్న మరోసారి విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ఎన్టీఏకు సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. విద్యార్థులు సాధించిన మార్కులను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను ధర్మాసనం సోమవారానికి వాయిదా వేసింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో చేనేతకు ప్రసిద్ధి పొందిన ధర్మవరం, మంగళగిరిలో టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేయాలని కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌ను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కోరారు. నిన్న ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు.

========================